నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 24 నవంబర్ 2024 | KARIMNAGAR

## రెండు లక్షలపై వెనుకా ముందు

రెండు లక్షలపై రుణాలు తీసుకున్న వారికి రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీకి కట్టుబడి ఉన్నామని ఇప్పుడు కూడా చెబుతున్నది. అయితే రూ.రెండు లక్షల పై పంట రుణాలు తీసుకున్న రైతులు ముందుగా ఆ పై మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించాలని ఓ తిరకాసు పెట్టింది. నిజానికి ప్రభుత్వ మాటను నమ్మి చాలా చోట్ల రైతులు పై అమౌంట్‌ను చెల్లించారు. కానీ, వారిలో ఒక్కరికి కూడా రుణమాఫీ చేయలేదు. దీంతో మిగిలిన రైతులు రెండు లక్షలపై మొత్తాన్ని చెల్లించడానికి వెనుకా ముందు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం చెప్పినట్టు ఆపై మొత్తం చెల్లిస్తే రుణమాఫీ జరుగుతుందో లేదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ చెల్లిస్తే రుణమాఫీ ఎప్పటిలోగా వర్తింపజేస్తారో చెప్పాలన్న దానికి ఏ అధికారి వద్ద సమాధానం లేదు. దీంతో సదరు రైతులు కూడా వేచి చూస్తున్నారు. దీని వల్ల వడ్డీలు తడసి మోపెడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- రెండు లక్షలలోపు మాఫీ నేటికి 58 శాతం మందికే
- క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తయినా వర్తింపు కరువే
- రెండు లక్షలపై ఉన్న రుణాలపై వీడని నీలినీడలు
- రోజురోజుకూ పెరుగుతున్న వడ్డీ
- స్పష్టత లేక అన్నదాతల్లో అయోమయం

అక్షరాలా.. లక్షా ముప్పై తొమ్మిది వేల నాలుగు వందల డెబ్బై ఏడు మందికి ఇంకా పంట రుణమాఫీ కాలేదు! ఇదీ కూడా రెండు లక్షలలోపు రుణం తీసుకున్న రైతుల సంఖ్యే! రెండు లక్షలపైన లోన్ తీసుకున్న అన్నదాతల సంఖ్య దాదాపు 40వేలకుపైనే ఉంటుందని అంచనా! నిజానికి రెండు లక్షలపై వారి మాట పక్కన పెడితే, ఆలోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో ఎవరూ స్పష్టంగా చెప్పడం లేదు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేసి తీరుతామని ముఖ్యమంత్రి, మంత్రులు ఊదరగొడుతున్నా ఎప్పటిలోగా పూర్తి చేస్తారో క్లారిటీ ఇవ్వడం లేదు. అంతేకాదు, రుణమాఫీకి సాంకేతిక కారణాలు అడ్డంకిగా నిలిచాయని, అందుకే క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తి చేసి.. ఆ వెంటనే మాఫీ చేస్తామని చెప్పిన మాటలు కూడా ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొన్నది. కొత్త రుణాలకు వెళ్లలేక, రుణమాఫీ అవుతుందో కాదో తెలియక ఆందోళన వ్యక్తమవుతున్నది. మరోవైపు ప్రభుత్వం తేల్చిన లెక్క ప్రకారం మాఫీకాని రైతుల సంఖ్య 1.39 లక్షల పైచిలుకు కనిపిస్తున్నా.. వాస్తవానికి అది రెండున్నర లక్షల వరకు ఉంటుందని తెలుస్తున్నది.

# 1,39,447 మందికి రుణమాఫీ కాలే!

కరీంనగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అధికారిక లెక్కల ప్రకారం చూస్తే.. ఉమ్మడి జిల్లాలో 3,78,678 మంది రైతులు రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్నట్టుగా గుర్తించారు. వీరంతా రుణమాఫీకి అర్హులని ముందుగా ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అయితే అందులో ఈరోజు వరకు చూస్తే మూడు దఫాలుగా 2,39,231 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. అంటే ఇప్పటివరకు 58శాతం రైతులకే మాఫీ జరిగినట్టుగా అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇంకా 42 శాతం మందికి రుణమాఫీ కావాల్సి ఉన్నది. ఇక రెండు లక్షలపైన రుణం తీసుకున్న వారి విషయంలో సర్కారు ఊసే ఎత్తడం లేదు. నిజానికి వాస్తవ లెక్కలను లోతుగా పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల మంది వరకు రైతులు రుణాలు తీసుకున్నట్టు సమాచారం. అయినా ఎంపిక సమయంలోనే ప్రభుత్వం పలు రకాల కొర్రీలు పెట్టడంతో ఆ సంఖ్య 3.78 లక్షలకు తగ్గింది. వీరికి కూడా సంపూర్ణంగా రుణమాఫీ కాకపోవడం సర్కారు వైఫల్యానికి అద్దం పడుతున్నది.



### మాఫీని మరిచిన సర్కారు

గద్దెనెక్కక ముందు ఢాంబికాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం రుణమాఫీ విషయాన్ని మరిచినట్టు కనిపిస్తున్నది. ఆగస్టులోపే అర్హులైన ప్రతిరైతుకూ రుణమాఫీ వర్తింప జేస్తామని ఎన్నికల ముందు పదేపదే చెప్పినా.. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సార్లు మాట మారుస్తూ వస్తున్నది. మూడు విడుతల్లో మాఫీ చేసినట్టు చూపినా.. ఆ లెక్కలను ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే కేవలం రుణమాఫీ అది కూడా రెండు లక్షలలోపు ఉన్న 58 శాతం మంది రైతులకు మాత్రమే జరిగింది. మిగిలిన రైతులు పోరుబాట పట్టగా.. ముందుగా సర్కారు బుకాయించే ప్రయత్నం చేసినా రైతుల ఆగ్రహాన్ని పసిగట్టి చివరకు దిగొచ్చింది. ముందుగా రేషన్‌కార్డు సంబంధమైన సమస్యలను పరిష్కరించేందుకు క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు అధికారులు ఉమ్మడి జిల్లాలో సుమారు 80వేల పైచిలుకు రైతు కుటుంబాల గ్రూపింగ్ పూర్తి చేసి, ఆ వివరాలను ప్రభుత్వానికి అప్‌లోడ్ చేశారు. అందుకు సంబంధించిన ప్రక్రియను ఆగస్టు 26 నుంచే మొదలు పెట్టగా.. పలు జిల్లాల్లో పక్షం రోజులు, మరొకొన్ని జిల్లాలో 20 రోజుల్లో పూర్తి చేశారు. గ్రూపింగ్ పూర్తయిన రైతుల వివరాలు అప్‌లోడ్ అయిన వెంటనే రుణమాఫీ వర్తింపజేస్తామని ప్రభుత్వం ముందుగా చెప్పింది. కానీ, గ్రూపింగ్ ప్రక్రియ పూర్తయి దాదాపు రెండున్నర నెలలు దాటుతున్నా నేటికీ అతీగతీ లేదు. అంతేకాదు, ఎప్పుడు మాఫీ చేస్తారో స్పష్టత ఇవ్వడం లేదు. ఇటీవల వేములవాడకు వచ్చిన ముఖ్యమంత్రి మాఫీ విషయంలో ఒక్క ముచ్చటా చెప్పలేదు. కానీ, ఇదే వేదికపై ఉన్న ఒకరిద్దరు మంత్రులు మాత్రం అర్హత ఉన్న వారికి మాఫీ చేస్తామంటూ చెప్పారే తప్ప నిర్దిష్ట సమయం చెప్పలేదు. దీంతో ఇప్పట్లో మాఫీ అవుతుందా..? లేదా..? అన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొన్నది.

### మిగిలిన రైతులపై ఇంకా అస్పష్టతే?

గ్రూపింగ్ పూర్తయిన రైతు కుటుంబాలకు ఎప్పుడు రుణమాఫీ చేస్తారన్న విషయంపై ప్రభుత్వం నేటికీ స్పష్టత నివ్వకపోగా, మిగిలిన అనేక కారణాలతో రుణమాఫీకాని రైతులకు సంబంధించి ఎప్పుడు సర్వే చేస్తారన్న దానిపై ఇంకా అస్పష్టత కొనసాగుతూనే ఉన్నది. రుణమాఫీ కాకపోవడానికి 31 సాంకేతిక కారణాలున్నాయని స్వయంగా రాష్ట్ర వ్యవసాయశాఖ గుర్తించి, ఆ వివరాలను గతంలోనే ప్రభుత్వానికి పంపిన విషయం తెలిసిందే. ఆ లెక్కన 31 అంశాలపై క్లారిటీ ఇస్తూ.. ఆ కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరించాల్సి ఉన్నప్పటికీ కేవలం రేషన్‌కార్డు సమస్యలను మాత్రమే గ్రూపింగ్ చేసింది. మిగిలిన 30 కారణాలతో రుణమాఫీ కాని వివరాలను నేటికి సేకరించడం లేదు. నిజానికి ఈ దిశగా ఇంకా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆధార్‌లో అచ్చు తప్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకానికి అలాగే బ్యాంకులో ఉన్న ఖతా నంబర్, ఆధార్ నంబర్ మధ్య తేడా, ఇన్‌వ్యాలిడ్ ఆధార్ నంబర్, నో డేటా ఫౌండ్, ఆధార్, రుణఖాతాల్లో వేర్వేరుగా ఉంటే ఆధార్ అప్‌లోడ్ చేయడం, ఆధార్ ఫ్యామిలీ గ్రూపింగ్, పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడం, ఆధార్‌తో బ్యాంకు లింకేజీ లేకపోవడం వంటి సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ప్రభుత్వం రుణమాఫీ వర్తింప జేయకుండా చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై వ్యవసాయశాఖ నివేదిక ఇచ్చినా, రేషన్‌కార్డు సంబంధిత సమస్యలపై గ్రూపింగ్ పూర్తి చేసిన సర్కారు.. మిగిలిన సమస్యలతో రుణమాఫీ పొందని వారికి సంబంధించి ఎప్పటి నుంచి వివరాలు సేకరిస్తుందన్న దానిపై స్పష్టత ఇవ్వడం లేదు.

### జిల్లాల వారీగా రైతులు, రుణమాఫీ అయిన వివరాలు

| జిల్లా | రైతులు | మాఫీ అయిన రైతులు | మాఫీ అయిన మొత్తం(రూ.కోట్లలో) | మాఫీ కావల్సిన రైతులు |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 93,043 | 71,102 | 546.25 | 21,941 |
| జగిత్యాల | 1,38,142 | 72,116 | 568.33 | 66,026 |
| పెద్దపల్లి | 83,717 | 51,393 | 375.58 | 32,324 |
| సిరిసిల్ల | 63,776 | 44,620 | 352.73 | 19,156 |
| మొత్తం | 3,78,678 | 2,39,231 | 1,842,89 | 1,39,447 |



## వామ్మో చలి!

కరీంనగరంలోని భగత్‌నగర్‌లో మంటకాగుతున్న కాలనీ వాసులు

ఉమ్మడి జిల్లాపై చలిపులి పంజా విసురుతున్నది. వారం రోజుల నుంచి భయపెడుతున్నది. మొన్నటిదాకా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 నుంచి 17డిగ్రీల మధ్య ఉన్నా, ప్రస్తుతం 15 డిగ్రీలకు పడిపోవడంతో వణుకు మొదలైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చల్లనిగాలులతో ప్రజానీకం గజగజా వణుకుతున్నది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

## కాంగ్రెస్ అబద్ధాలకు మహారాష్ట్ర ప్రజలు మోసపోలేదు

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, నవంబర్ 23 : మహారాష్ట్ర ప్రజలు తెలివైన నిర్ణయం తీసుకున్నారని, కాంగ్రెస్ అబద్ధపు హామీలకు మోసపోకుండా చిత్తుచిత్తుగా ఓడించారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశంసించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లి తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, మహిళలకు ₹2500 ఇస్తున్నామని, ఇక్కడ పార్టీ అధికారంలోకి వస్తే ₹3వేలు ఇస్తామని మాయమాటలు చెప్పారని విమర్శించారు. కానీ, అక్కడి ప్రజలు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ దొంగ హామీలతో గెలిచిన విషయాన్ని తెలుసుకొని ఆ పార్టీని ఓడించారని చెప్పారు. అయినా రేవంత్‌రెడ్డి ఇక్కడ హామీలు నెరవేర్చకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లి హామీలు నెరవేరుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు

## రాష్ట్రంలో రాక్షస పాలన

- మాజీ సర్పంచ్‌ల జేఏసీ సిరిసిల్ల జిల్లా కన్వీనర్ అక్కెనపల్లి కరుణాకర్
- మాజీ సర్పంచ్ మృతికి సంతాపం.. కొవ్వొత్తులతో నివాళి

సిరిసిల్ల టౌన్, నవంబర్ 23 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ముసుగులో రాక్షస పాలన సాగిస్తున్నదని మాజీ సర్పంచుల జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ అక్కెనపల్లి కరుణాకర్ విమర్శించారు. కొండారెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోగా, మృతికి సంతాపంగా శనివారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, ప్రజా పాలనలో సుభిక్షంగా ఉంటామని ఆలోచన చేసిన ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా ప్రభుత్వం పని చేస్తున్నదని మండిపడ్డారు. దోపిడీ, అణచివేత, నియంతృత్వమే నినాదంగా పాలన అందిస్తున్నారన్నారు. ఇంటికి దారి విషయంలో రేవంత్ సోదరులు వేధించడంతోనే మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. సాయిరెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కోర్టులో రికార్డు గది ధ్వంసం

- బయోమెట్రిక్ మిషన్ సైతం..
- దొంగతనానికి ప్రయత్నం
- ఫైళ్లు కాల్చివేసిన ఆనవాళ్లు
- పోలీసులకు సీనియర్ సూపరింటెండెంట్ ఫిర్యాదు

కరీంనగర్ రాంనగర్, నవంబర్ 23 : కరీంనగర్ జిల్లా కోర్టులోని రికార్డు గది, బయోమెట్రిక్ మిషన్‌ను ధ్వంసం చేసి, దొంగతనానికి ప్రయత్నించారని సీనియర్ సూపరింటెండెంట్ మజీద్ శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో ఉన్న వివరాల మేరకు.. సూపరింటెండెంట్ మజీద్ ఉదయం కోర్టు కార్యాలయానికి వచ్చినప్పుడు రికార్డ్ రూం తలుపు తాళం వంగి ఉంది. రికార్డు గదిని ఎవరో తెరిచేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అలాగే, ఫ్యామిలీ కోర్టు దగ్గర బిగించిన బయోమెట్రిక్ మిషిన్ ధ్వంసమైంది. లేడీస్ వాష్ రూమ్‌లో కొంత బూడిద ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు కాగితాలు తగులబెట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ మేరకు పోలీసులు జిల్లా కోర్టు రికార్డు గది, ఫ్యామిలీ కోర్టు ఆవరణకు వెళ్లి సిబ్బందిని విచారించి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. శుక్రవారం రాత్రి 8:45 గంటలకు ఎర్రచొక్కా, నీలిరంగు జీన్స్ ధరించిన ఓ వ్యక్తి సుత్తి, సీసా, తదితరాలతో కోర్టు ఆవరణలో తిరుగుతూ ఫ్యామిలీ కోర్టు సమీపంలో బయోమెట్రిక్‌మిషన్, సామగ్రిని ధ్వంసం చేసి, చోరీకి ప్రయత్నించినట్టు గుర్తించారు. ప్రిన్సిపల్ జిల్లా జడ్జి అనుమతితో సూపరింటెండెంట్ ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

## పార్సిల్‌లో డ్రగ్స్ వచ్చాయని ₹21.80 లక్షల టోకరా

- కస్టమ్స్ విభాగం నుంచి ఫోన్ చేస్తున్నామని మహిళను బెదిరించి మోసం
- ఫిర్యాదుతో సైబర్ నేరస్తుడి అరెస్ట్
- ఒడిశాలో అదుపులోకి తీసుకున్న కరీంనగర్ పోలీసులు

రాంనగర్, నవంబర్ 23 : ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ విభాగం నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పేరిట పార్సిల్ వచ్చిందని, అందులో ఏటీఎం కార్డులు, డ్రగ్స్ లభ్యమయ్యాయని బెదిరించి ఓ సైబర్ నేరస్తుడు ఓ మహిళ నుంచి ₹21.80 లక్షలు కాజేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కరీంనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ జిల్లాకు చెందిన సదాన్షు శేఖర్ మహంతి భువనేశ్వర్‌లో వ్యాపారం చేస్తున్నట్టు చూపి పంజాబ్ నేషనల్ బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేశాడు. తన అన్న సర్వేశ్వర్ మహంతితో కలిసి సైబర్ క్రైం నేరాలకు పాల్పడుతూ, బాధితులకు ఈ అకౌంట్ నంబర్ చెప్పి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకునేవారు. ఈ క్రమంలో కరీంనగర్‌కు చెందిన ఓ మహిళకు ఫోన్ చేశారు. ఢిల్లీ పోలీసులు రమ్మంటున్నారని బెదిరించడంతో భయపెట్టారు. దీంతో ఆమె రెండు దఫాలుగా వారు చెప్పిన బ్యాంక్ అకౌంట్లలో ₹21.80 లక్షలు డిపాజిట్ చేసింది. ఆ తర్వాత మోసపోయినట్టు గుర్తించి, వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ సెంటర్ 1930కు ఫిర్యాదు చేసింది. పిటిషన్ రాగానే కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ నర్సింహారెడ్డి ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు విచారించే సమయంలో నేరస్తుడు ఒడిశా రాష్ట్రానికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్లలో డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేసినట్టు గుర్తించారు. ఏసీపీ ఆదేశాల మేరకు సైబర్ క్రైం ఎస్ఐ వంశీకృష్ణ సిబ్బందితో కలిసి భువనేశ్వర్ జిల్లాలో తలదాచుకున్న శేఖర్ మహంతిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించామని, అతడి అన్న సర్వేశ్వర్ మహంతి ఢిల్లీ పోలీసుల అదుపులో ఉన్నాడని ఏసీపీ తెలిపారు. నేరం చేయడానికి ఉపయోగించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ అకౌంట్‌పై దాదాపు 24 కేసులు ఉన్నాయని, తెలంగాణలోని మూడు జిల్లాలతోపాటు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, బిహార్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రలోనూ వీరిపై కేసులు ఉన్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. నేరస్తుడిని పట్టుకున్న సిబ్బందిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్, కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ అభినందించారు.



నిందితుడు సదాంషు శేఖర్ మహంతి

## అండర్ గ్రౌండ్ బిన్స్.. ఔట్ ఆఫ్ సర్వీస్

- శిథిలావస్థకు డంపర్ బిన్స్
- పట్టించుకోని అధికార యంత్రాంగం



రంధ్రాలతో శిథిలావస్థకు చేరిన డంపర్ బిన్స్



బస్టాండ్ వెనుక ప్రాంతంలో ఏర్పాటు చేసిన అండర్ బిన్స్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 23 : రెండేళ్ల కిత్రం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ డంపర్ బిన్స్‌ను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి ఎందుకూ అక్కరకు రాకుండా పోయాయి. ఆరు ప్రాంతాల్లో సుమారు 14 బిన్స్‌ను రూ.కోటికిపైగా వ్యయం చేసి కొనుగోలు చేశారు. అందులో మూడు ప్రాంతాల్లో బిగించారు. వేసిన చెత్తను తొలగించేందుకు కొనుగోలు చేసిన వాహనాన్ని సైతం పక్కన పెట్టడంతో ఆయా ప్రాంతాల్లో బిగించిన బిన్స్ అధ్వానంగా మారాయి. అలాగే, మిగిలిన బిన్స్ అన్ని కార్యాలయంలో ఓ మూలన పడేశారు. వినియోగించే విషయంలో సృష్టత లేకుండానే ఎందుకు కొనుగోలు చేశారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు డంపర్ బిన్స్ కూడా శిథిలావస్థకు చేరడంతో వీటిల్లో వేసిన చెత్త డంప్ యార్డుకు తరలించే సమయంలో రంధ్రాల నుంచి రోడ్లపై చెత్త పడిపోతున్నది. మరమ్మతులు చేయాలని పారిశుధ్య విభాగం అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అండర్ గ్రౌండ్ బిన్స్ కొనుగోలు చేయడం వల్ల వీటి అవసరం లేదన్నట్లుగా ఉన్నతాధికారులు పేర్కొంటూ వచ్చారు. కానీ, అండర్ బిన్స్‌ను కూడా ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో ఇన్నాళ్లుగా ఇబ్బందిగానే కొనసాగిస్తూ వస్తున్నారు. కోట్లాది రూపాయాలు వ్యయం చేసి కొనుగోలు చేసిన అండర్ బిన్స్, వాహనాలను ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేదన్న విషయంలో అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### ఇప్పుడు దృష్టి పెడుతున్న అధికారులు

కాగా, నగరంలో చెత్త తరలింపు విషయంలో విమర్శలు వస్తుండడంతో నగర ఉన్నతాధికారులు అండర్ బిన్స్ వినియోగించే విషయంలో దృష్టి సారిస్తున్నారు. అయితే గతంలో వివిధ ప్రాంతాల్లో బిగించిన అండర్ బిన్స్‌లో చెత్త ఉండడం వాటిని పట్టించుకోకపోవడంతో అవి కూడా మరమ్మతులకు వచ్చినట్లు అధికారులు చెప్పుతున్నారు. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విషయంలో ఉన్నతాధికారులు చర్యలు చేపడుతుండడం విచిత్రంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




## విశ్వవిద్యాలయ ఫార్మసీలో తక్షణ ప్రవేశాలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 23 : శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో బీ-ఫార్మసీ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26న తక్షణ ప్రవేశాలు(స్పాట్ అడ్మిషన్లు) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11 గంటలలోపు ఉజ్వల పార్కు సమీపంలోని ఫార్మసీ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారికి అవకాశం ఉంటుందని, అభ్యర్థులు ఇంటర్మీడియట్ వరకు టీసీతో సహా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎప్‌సెట్ ర్యాంకు కార్డు తీసుకుని రావాలని తెలిపారు. ఎప్‌సెట్ అర్హులు లేని క్రమంలో ఇతరులకు అవకాశం ఉంటుందన్నారు. తక్షణ ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు అర్హత ఉండదని చెప్పారు. ఆ విద్యార్థులు పూర్తి ఫీజు సంవత్సరానికి రూ.31,000 చెల్లించాలని తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ (www.satavahana.ac.in) ను సందర్శించాలని సూచించారు.